సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్న అంతర్‌జిల్లా దొంగను సిద్దిపేట పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు 8లో ▸



విద్యార్థుల్లో 'సాక్షి'కి ఆదరణ

'సాక్షి' పత్రికకు అన్ని వర్గాలతోపాటు విద్యార్థుల నుంచి ఆదరణ లభిస్తోంది.

వివరాలు 8లో ▸



పేలుళ్ల కలకలం

జహీరాబాద్ పట్టణంలోని ముసానగర్ మురికి కాల్వలో శనివారం జరిగిన పేలుళ్లు కలకలం రేపాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్య అందించాలి

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి (డీఈవో) వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌పై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ...ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌పై ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించగలుగుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు రాజేశ్వర రావు నాయక్, పీపీ రాథోడ్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం స్పందన, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే మంచి భవిష్యత్

డీజీపీ అభిలాష్ బిస్త్



మాట్లాడుతున్న డీజీపీ అభిలాష్ బిస్త్

జహీరాబాద్ టౌన్: ఉన్నత విద్యతోనే మంచి భవిష్యత్ ఏర్పడుతుందని, కలలను సాకారం చేసుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర పోలీసు అకాడమీ(ట్రైనింగ్) డీజీపీ అభిలాష్ బిస్త్ పేర్కొన్నారు. జహీరాబాద్‌లోని మహీంద్ర అకాడమీ హై స్కూల్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన 27వ వార్షికోత్సంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. నిర్లక్ష్యం కారణంగా తాను కూడా యూపీఎస్‌సీ పరీక్షలో దెబ్బతగిలిందని ఆ తర్వాత పట్టుదలతో లక్ష్యాన్ని అధిగమించానని గుర్తు చేసుకున్నారు. పిల్లలను ఫోన్‌కు దూరంగా ఉంచాలని, ఫోన్ ద్వారా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో మహీంద్ర గ్రూప్ ఎగ్జిక్యూటీవ్ బోర్డు మెంబర్, ఆనంద్ మహీంద్ర సోదరి రాధిక నాథ్, మహీంద్ర గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షీతల్ మెహతా, సినీ నటుడు మానవ కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

టీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా

నారాయణఖేడ్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించేందుకు కృషి చేయాలని తెలంగాణ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్లా ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యేను ఖేడ్‌లోని ఆయన నివాసంలో కలసి సంఘం 2025 నూతన సంవత్సర డైరీని అందజేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించేందుకు కృషిచేయాలని ఆయనను ఎమ్మెల్యే కోరారు.

సంగమేశ్వరా!!.. సకలం సిద్ధం



ఝరాసంగంలోని శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయం

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- 28న శివపార్వతుల కల్యాణం
- పూర్తి కావొచ్చిన ఏర్పాట్లు.. తరలిరానున్న భక్తజనం



ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతోంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రతీ ఏటా నవాహ్నిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. కేతకీలో ఆదివారం శిఖరపూజతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 26న మహాశివరాత్రి, 28న శివపార్వతుల కల్యాణం జరగనుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ఆలయ, వివిధ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయానికి ఇలా చేరుకోవచ్చు

హైదరాబాద్ నుంచి సంగారెడ్డి వైపు వచ్చేవారితో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ముందుగా జహీరాబాద్ చేరుకోవాలి. అక్కడ్నుంచి మాచ్నూర్, కుప్పానగర్ మీదుగా ఝరాసంగం కేతకీ ఆలయానికి చేరుకోవచ్చు. నిజామాబాద్, నారాయణ ఖేడ్, ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రాయికోడ్ చౌరస్తా నుంచి కప్పాడ్ చౌరస్తా మీదుగా చేరుకోవచ్చు.

సర్వాంగసుందరంగా కేతకీ ముస్తాబు

కేతకీ ఉత్సవాలకు రాజగోపురం, కమాన్, ఆలయ పరిధిలో రంగులు వేసి ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. శిఖర పూజ అనంతరం ఆలయానికి, కమాన్ వద్ద రంగురంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేయనున్నారు. పురఃవీధులలో వీధి దీపాల ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో పార్కింగ్, క్యూలైన్లు, బారికేడ్లు, తాగునీరు, ఆరోగ్యం తదితర వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పార్కింగ్, ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కేతకీ ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, పలు ఆదేశాలు జారీ చేశారు.



ఆలయ ఆవరణలోని అమృత గుండం

మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్, జహీరాబాద్ పట్టణాల నుంచి రెగ్యులర్ బస్సులతోపాటు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా పాటలు, డ్రామాలు, చలన చిత్ర ప్రదర్శనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా...



మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని కేతకీ ఆలయానికి గతంలో కంటే భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా పార్కింగ్, ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాము.

–శివరుద్రప్ప, ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఝరాసంగం

రాసి పెట్ ఉండాలి దర్జా బతుకు..!



- కుక్కలకు పెరుగుతున్న క్రేజ్
- కుటుంబంలో ఒకటిగా స్థానం కల్పిస్తున్న పెట్ లవర్స్
- ఇంటి రక్షణ కోసం పెంపకం
- జాతిని బట్టి రూ.వేల నుంచి రూ.లక్షల్లో ఖరీదు
- పెట్ క్లబ్‌లకూ భలే డిమాండ్
- మంచి ఆహారం, కాస్మోటిక్స్, బాతింగ్

సండే స్పెషల్ వివరాలు 8లో ▸

'ఏం బతుకురా నీది.. కుక్క బతుకు' అని చాలా తేలిగ్గా మాట్లాడుతాం. ఈ తిట్టుకు ఇప్పుడు అర్థం మార్చేస్తోంది ఆధునిక సమాజం. పూట కూడా గడవని మనుషులు ఒకవైపు.. విలాసాలకు అలవడిన ధనికులు మరోవైపుగా చీలిపోతున్న సమాజంలో పెంపుడు కుక్కలకూ మనషుల జీవనశైలి అలవాటు చేస్తోంది. ఇప్పుడు కుక్కలు పార్కులకు వెళ్తాయి.. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడతాయి..వాటికి నచ్చిన ఆహారం తింటాయి.. ఉదయాన్నే బయటికి వెళ్లి షికార్లు కొడతాయి. పుట్టిన రోజులు కూడా చేసుకుంటాయి. తోటి కుక్కలతో కలసి పార్టీలు చేసుకుంటాయి. మనిషి, శునకాల జీవనశైలికి అంతగా తేడాలేకుండా పోతుందని ఆశ్చర్యపడుతున్నారా? అవును.. రూ.లక్షలు ఖర్చు చేసి మరీ వాటి బాగోగులు చూస్తున్నారు. డాగ్ లవర్స్ అనే పరిధి దాటి పెట్ పేరెంట్స్‌గా చెప్పే స్థాయికి చేరుకుంది ఎలైట్ సొసైటీ. పెట్‌ను పెంచుకోవడమంటే వారి కుటుంబంలోకి ఓ వ్యక్తిని ఆహ్వానించినట్లే.. మరి ఆ అతిథిని వీరంతా ఎలా చూసుకుంటున్నారనే దానిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– పర్చ శ్రీనాథ్, రామచంద్రాపురం(పటాన్‌చెరు)

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ. చిత్రంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

- కాంగ్రెస్‌కు సర్వ మతాలు సమానమే
- క్రాస్ ఓటింగ్‌తోనే బీజేపీ ఎంపీ గెలుపు
- మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ

కొండాపూర్(సంగారెడ్డి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తాలో శనివారం ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి మంత్రులు దామోదర, కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా దామోదర మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ మత రాజకీయాలు చేయలేదన్నారు. కాంగ్రెస్‌పార్టీ సర్వమతాలను సమానంగానే చూసిందని తెలిపారు. కొన్ని పార్టీలు మత విద్వేషాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదికాలంలో చేసిన అభివృద్ధిని పట్టభద్రులకు వివరించాలని సూచించారు. ఈ ఎన్నికల్లో గెలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ గెలుపు సులభమవుతుందని తెలిపారు. నరేందర్‌రెడ్డి గత 35 ఏళ్లుగా ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించిన విద్యావేత్తని ప్రశంసించారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ....ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టకుండా పరోక్షంగా బీజేపీకి మద్దతిస్తోందన్నారు. ఎంపీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు క్రాస్ ఓటింగ్ వల్లే ఎంపీగా గెలుపొందారని గుర్తు చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా కేటాయించారన్నారు. రేవంత్ సర్కార్ చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తా

పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ...ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ఉద్యోగుల,పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఒక యూనివర్సిటీ ఉందని, ఉమ్మడి జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నర్సింహారెడ్డి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్,నాయకులు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హుందాగా ప్రవర్తించాలి: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు టౌన్/సంగారెడ్డి ఎడ్యుకేషన్: పనిచేసే చోట మహిళా సిబ్బందితో మర్యాదగా, హుందాగా నడుచుకోవాలని, ఇతరుల పట్ల గౌరవం ముందు మన నుంచే ప్రారంభం కావాలని జిల్లా ఎస్పీ రూపేశ్ పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం, రుద్రారం గీతం ఇంజనీరింగ్ కళాశాలలో 'ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, పనిచేసే చోట మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పనిచేసే చోట మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించే వారికి నూతన చట్టాల ప్రకారం కఠిన శిక్షలు పడతాయన్నారు. అత్యాశకు పోయి డబ్బులు రెట్టింపు అవుతాయని అడ్డదారుల్లో సంపాదించేందుకు ప్రయత్నించకూడదని హితవు పలికారు. అవసరాల రీత్యా మాత్రమే రుణాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కల్యాణి, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, సత్తయ్యగౌడ్, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జిల్లా సీఐలు, ఎస్‌ఐలు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సీరియస్‌గా కాదు సిన్సియర్‌గా చదవాలి

విద్యార్థులు సీరియస్‌గా కాకుండా సిన్సియర్‌గా చదువుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుసాగితేనే గమ్యం చేరుకోవచ్చని ఎస్పీ రూపేశ్ విద్యార్థులకు సూచించారు. శనివారం సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్ హాల్లో ఎస్పీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆహుతులను అలరించాయి. పూర్వ విద్యార్థులు సైతం హాజరై కళాశాలతో, అధ్యాపకులతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు టీజీ సెట్-2025

పటాన్‌చెరు టౌన్/మునిపల్లి(అందోల్): పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో టీజీ సెట్-2025ను ఆదివారం నిర్వహించనున్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతుందని, అభ్యర్థులు గిరిజన గురుకుల డిగ్రీ (పురుషుల) కళాశాలకు ఉదయం 9 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ సోమనాథశర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 91772 29922 సంప్రదించాలన్నారు.

5, 9 తరగతులలో ప్రవేశానికి...

మునిపల్లి మండలంలో 2025–2026 విద్యా ఏడాదికి గురుకులాల్లో 5, 9వ తరగతులలో ప్రవేశానికి బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ బోళ మాధవి ఓ ప్రకటనలో వెల్లడించారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి: కలెక్టర్ క్రాంతి



ఉస్మాన్‌నగర్ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, ఉస్మాన్‌నగర్‌లోని కస్తూర్బా బాలికల పాఠశాలలను శనివారం సాయంత్రం కలెక్టర్ క్రాంతి తనిఖీ చేశారు. పాఠశాలలోని కిచెన్ షెడ్లు, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి పదికి పది జీపీఏ వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

విద్యార్థుల ఫిర్యాదు

వెలిమెలలో ప్రభుత్వ మోడల్ స్కూల్ ఆవరణలోని హాస్టల్‌ను సందర్శించిన కలెక్టర్ క్రాంతికి భోజనం సరిగా ఉండటంలేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. తమకు భోజనం సరిగా ఇవ్వడం లేదని, కూరలో నీళ్లు ఎక్కువగా ఉంటున్నాయని తెలిపారు. దీంతో నిర్వాహకులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల్లో పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తిర'గాలి' వేగం.. ఉత్పత్తి నిరంతరం

పెరుగుతున్న పవన విద్యుత్

- సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ప్రాజెక్టులు
- రూ.500 కోట్ల వ్యయంతో ఏర్పాటు
- మరికొద్ది రోజుల్లో అదనపు విండ్ టవర్లు

సంగారెడ్డి జోన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కొత్త కొత్త టెక్నాలజీని వినియోగించుకుని విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. రోజురోజుకీ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. పరిశ్రమలతోపాటు గృహాల్లోనూ విద్యుత్ అవసరాలు ఎక్కువయ్యాయి. విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి.

11,730 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఝరాసంగం మండలంలో ఏర్పాటు చేసిన పవన విద్యుత్ ప్రాజెక్టు ద్వారా ప్రారంభం నుంచి ఇప్పటివరకు 11,730 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక రోజులో సుమారు 25 నుంచి 27 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. సంవత్సరంలో జూన్ నుంచి అక్టోబర్ మధ్యలో గాలులుగా ఎక్కువగా వీయడంతో విద్యుదుత్పత్తి ఎక్కువగా ఉంటుంది. ప్రతీ ఆరు నెలలకొకసారి టర్బైన్ టవర్ల నిర్వహణ చేపడుతారు.

రూ.500 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టు

హీరో ఫ్యూచర్ పవన విద్యుత్ ప్రాజెక్టు సుమారు రూ.500 కోట్ల పెట్టుబడితో నెలకొల్పారు. ఇప్పటివరకు 13 టర్బైన్ టవర్లను ఏర్పాటు చేయగా మరికొన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒక్కో టర్బైన్ టవర్ సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మాణం కానుంది.

వికారాబాద్ జిల్లాలో

వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో 48 టర్బైన్ టవర్లతో 100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుదుత్పత్తి ప్రాజెక్టును ఏర్పాటు చేశారు.

నిమ్జ్ ఏర్పాటు నేపథ్యంలో

జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో నిమ్జ్ (జాతీయ పారిశ్రామిక ఉత్పత్తి మండలి) 12,635 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. నిమ్జ్‌లో ఏర్పాటు అయ్యే పరిశ్రమలకు అవసరమయ్యే విద్యుత్‌ను సరఫరా చేయనున్నారు.



ఝరాసంగం మండలంలోని టర్బైన్ టవర్లు

- ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు రాష్ట్రాల్లో పవన విద్యుత్, తెలంగాణ రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పవన విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నారు.
- రాష్ట్రంలో సంగారెడ్డి, వికారాబాద్‌తోపాటు పలు జిల్లాలోని ప్రాంతాల్లో పవన విద్యుదుత్పత్తికి అనుకూలమని జాతీయ పవన విద్యుదుత్పత్తి సంస్థ సర్వే వెల్లడించింది.
- సంగారెడ్డి జిల్లాతోపాటు వికారాబాద్ జిల్లాలో 100 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులను నెలకొల్పారు. ఆయా జిల్లాల్లో కొన్నేళ్లుగా విద్యుదుత్పత్తి కొనసాగుతుంది.
- సోలార్ విద్యుదుత్పత్తి కేవలం ఎండ ఉన్న సమయాల్లోనే జరుగగా పవన విద్యుత్ మాత్రం వీచే గాలిని బట్టి 24 గంటలూ జరుగుతుంది.



ఝరాసంగంలో ఏర్పాటు చేసిన పవన విద్యుదుత్పత్తి సబ్‌స్టేషన్

సంగారెడ్డి జిల్లాలో హీరో ఫ్యూచర్స్ ప్రాజెక్టు

జిల్లాలోని ఝరాసంగం మండల పరిధిలోని చీలపల్లి, చీలపల్లి తండా, బర్దిపూర్, ఎల్గోయి గ్రామ శివారులో అనువైన స్థలాలను గుర్తించారు. హీరో ఫ్యూచర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 100 మీటర్ల ఎత్తులో 13 పవర్ జనరేటింగ్ టర్బైన్ టవర్స్‌తో కూడిన విద్యుదుత్పత్తి ప్రాజెక్టును నెలకొల్పారు. ఒక్కో టర్బైన్ టవర్ వీచే గాలి సామర్థ్యాన్ని బట్టి ఒక రోజులో 2.1 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. 100 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గల ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రోజుకి 25 నుంచి 27 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. ఝరాసంగం మండలం పరిధిలోని కుప్పానగర్– మాచ్నూర్ గ్రామాల శివారులో ప్రత్యేకంగా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను సబ్ స్టేషన్‌కు సరఫరా చేసి అక్కడి నుంచి జహీరాబాద్ శివారులోని కాశీంపూర్ ప్రభుత్వ సబ్‌స్టేషన్‌కు తరలిస్తారు. ఇక్కడి నుంచి అవసరాల మేరకు ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు.

క్లుప్తంగా

చిరుత దాడిలో దూడ మృతి


దూడ కళేబరం వద్ద బాధిత రైతు

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులో చిరుత దాడి చేసి దూడను హతమార్చింది. మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామానికి చెందిన రైతు స్వామి తన పశువులను వ్యవసాయ బావి వద్ద ఉంచగా, రాత్రి చిరుత దాడి చేసి హతమార్చింది. స్వామి ఉదయం పొలానికి వెళ్లి చూడగా, హతమైన దూడ కనిపించింది. సమీపంలో చిరుత పాదముద్రలు ఉండటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశాడు. రైతులు జాగ్రత్తగా ఉండాలని, ఒకరిద్దరు వెళ్లకుండా కలిసి కట్టుగా వెళ్లాలని రేంజీ అధికారి విద్యాసాగర్ సూచించారు.

బస్సు డ్రైవర్ చాకచక్యం

నాచగిరి వద్ద ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ
ప్రయాణికులకు తప్పిన ముప్పు


ఘటనా స్థలంలో టిప్పర్, ఆర్టీసీ బస్సు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి వద్ద శనివారం ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. స్థానికులు, బస్సు డ్రైవర్ రబ్బాని తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు శనివారం మధ్యాహ్నం ప్రయాణికులతో గజ్వేల్ నుంచి సంగారెడ్డికి బయల్దేరింది. నాచగిరి క్షేత్రం బ్రిడ్జి వద్దకు చేరేసరికి ఎదురుగా వస్తున్న ఓ టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో వాహనాలు స్వలంగా దెబ్బతిన్నాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యువకుడి మృతి

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. న్యాల్‌కల్ గ్రామానికి చెందిన నాగరాజు(30) జహీరాబాద్‌లో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం కుప్పానగర్ గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి బయల్దేరిన నాగరాజు ఊరికి చేరుకుని రోడ్డుపక్కనే వాహనం నిలుపుతుండగా...జహీరాబాద్ వైపు నుంచి మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఖేలో ఇండియాకు విజ్ఞాన్ విద్యార్థులు


సౌత్‌జోన్ పోటీలకుఎంపికైన విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఖేలో ఇండియా ఆటల పోటీలకు సౌత్‌జోన్‌కు స్థానిక విజ్ఞాన్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఖేలో ఇండియా ఆటలకు సంబంధించి రాష్ట్రస్థాయి పోటీల్లో భావిక, సాయిశృతి, వైష్ణవి, హరిచందనలు గెలుపొందారని పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌గౌడ్, ప్రిన్సిపాల్ అనురాధ,వైస్ ప్రిన్సిపాల్ సిద్ధన్న శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

రాసి పెట్ ఉండాలి

దర్జా బతుకు..!



• కుక్కలకు పెరుగుతున్న క్రేజ్ • ప్రత్యేక నిపుణులతో శిక్షణ


రామచంద్రాపురం(పటాన్‌చెరు): పెట్ లవర్స్ సిటీలో ఈ పదానికి ఒక క్రేజీ ఏర్పడింది. మనుషులే కాకుండా వారి జీవితాల్లో సాధు జంతువులను మమేకం చేసుకుంటూ ఆత్మీయంగా పెంచుతున్నారు. నిత్య జీవితంలో ఎంత బిజీ ఉన్నప్పటికీ మూగజీవాలపై తన వంతు మమకారాన్ని చూపిస్తున్నాడు. అందుకోసం ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడడం లేదు. వేలాది రూపాయలతో కొనుగోలు చేయడమే కాకుండా విలాసమైన జీవితాన్ని అందిస్తున్నారు. వారి స్థాయికి తగ్గట్టుగా విలాసమైన సౌకర్యాలను కల్పించి సంబురపడుతున్నారు. దానికి చిన్న అనారోగ్య సమ్యస వచ్చినా తట్టుకోలేని పరిస్థితికి వచ్చాడంటే ఆ మూగ జీవాలపై ఎంత బంధం పెంచుకున్నాడో అర్థమవుతుంది.

పెరుగుతున్న డిమాండ్

చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వారి ఇళ్లలో పెట్స్ పెంచుకోవడానికి ఎంతో ఆసక్తి చూపుతున్నారు. దీంతో మేలు జాతి డాగ్‌లను విక్రయించేందుకు అనేక మంది ముందుకొస్తున్నారు. చాలా మంది ప్రశాంతత కోసం పెట్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. మరి కొంత మంది ఇంటి రక్షణ కోసం పెట్స్‌ను పెంచుతున్నారు. ఈ క్రమంలో మేలు జాతి డాగ్‌లకు రోజురోజుకూ మంచి డిమాండ్ పెరుగుతుంది.


డాగ్‌లకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

పలు జాగ్రత్తలు తీసుకోవాలి



కుక్కలు పుట్టిన తర్వాత 15రోజుల నుంచి 3నెలల వరకు ప్రతీ 15రోజులకొకసారి, 3 నుంచి 6నెలల వరకు ప్రతీ నెల నట్టలమందు తాగించాలి. 7 ఇన్ వాన్ వ్యాక్సిన్ కుక్కలకు ముఖ్యమైంది. పుట్టిన 45రోజులు దాటాక మొదటి వ్యాక్సిన్, ఆ తర్వాత 3 వారాలకు రెండో వ్యాక్సిన్ ఇవ్వాలి. ఇవి ప్రతీ ఏటా క్రమం తప్పకుండా ఇవ్వాలి. –డా.వంశీ కృష్ణారెడ్డి, పశువైద్య సహాయ శస్త్రచికిత్సకుడు, రామచంద్రాపురం


పెట్స్ క్లబ్‌లో బోర్డింగ్‌లో సేద తీరుతున్న డాగ్స్

జోరుగా పెట్ క్లబ్‌లు

అనేక మంది పెట్స్‌ను పెంచుకోవడానికి ఆసక్తిని చూపడంతో మార్కెట్‌లో అందుకు అనుగుణంగా పెట్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పెట్స్‌కు సంబంధించిన ఆహార పదార్థాలు, గొలుసులు, షాంపులు, బొమ్మలు, టీ షర్ట్స్, హెర్ కట్టింగ్‌లతోపాటు వాటి బాతింగ్, స్విమ్మింగ్ చేయిస్తారు. ఎవరైనా దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి డాగ్‌లకు ఇక్కడే బోర్డింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అందుకు గంటకు రూ.50, రోజుకు రూ.800 చార్జీ చేస్తారు. దానికి ఏసీ గదితోపాటు ఆహారం అందిస్తారు. ఈ క్రమంలో పెట్ క్లబ్‌లకు మంచి డిమాండ్ వచ్చింది.


పెంపుడు డాగులతో యజమాని

జాతిని బట్టి ఖరీదు

ఇళ్లలో పెంచుకొనే పెట్స్ జాతిని బట్టి ధర ఉంటుంది. డాగ్స్‌లో సుమారు 360 జాతులు ఉండగా అందులో స్నేహపూర్వకంగా ఉంటే డాగ్స్ మాత్రమే మంచి డిమాండ్ ఉంది. వాటిలో కొన్ని జాతి డాగ్‌లను మాత్రమే ఎంచుకుంటున్నారు. అందులో ప్రధానం ల్యాబ్ జాతి పిల్ల రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు నుంచి లభిస్తుంది. గోల్డెన్ రిట్రీవర్ జాతి డాగ్ రూ.20 వేల నుంచి నాణ్యతను బట్టి రూ.80 వేల వరకు లభిస్తుంది. జర్మన్ షెపర్డ్ రూ.10 వేల నుంచి నాణ్యత బట్టి రూ.60 వేల వరకు లభిస్తుంది. పూడ్లే జాతి డాగ్ రూ.80 వేల నుంచి రూ.1.5 లక్ష వరకు లభిస్తుంది. హాస్కీ జాతీ డాగ్ రూ.60 వేల నుంచి మొదలవుతుంది. విదేశీకి చెందిన జాతి డాగ్‌లు రూ.3 లక్షలపై ధర ఉంటుందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

శిక్షణ కేంద్రాలు, తప్పిపోతే ప్రకటనలు

ఇళ్లలో పెంచుకునే పెట్స్‌కు ప్రతేక్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అందరితో స్నేహంగా ఉండేందుకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. నెల రోజులు శిక్షణ కోసం రూ.25 వేల నుంచి రూ.35 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. శిక్షణ పొందిన కుక్కలు అందరి దగ్గరికి వెళ్తుంటాయి. ఇంటి వాళ్లని తొందరగా గుర్తిస్తుంటాయి. ఎవరిపైనా దాడి చేయకుండా ఉంటాయి. ఒక వేళ ఇంట్లోని పెంపుడు డాగ్ తప్పిపోతే అందుకు ప్రకటనలు సైతం చేస్తున్నారు. డబ్బు ఎంతైన ఖర్చు చేస్తున్నారు. దానిని వెతికి తెచ్చిన వారికి బహుమతులు సైతం అందజేస్తున్నారు.

ఎంతో ఉపాధి లభిస్తుంది



అనేక మంది పెట్స్‌ను పెంచుకోవడం వల్ల అనేక మందికి ఉపాధి లభిస్తుంది. నేను కోవిడ్ సమయంలో మిత్రుల డాగ్స్‌తో ఆడుకుంటూ దానిని వృత్తిగా మార్చుకున్నాను. తెల్లాపూర్‌లో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పిస్తున్నాను. మా శిక్షణ కేంద్రంలో డాగ్స్ మెరుగైన శిక్షణ అందిస్తున్నాం.

– గాంధీ కృష్ణయాదవ్, డాగ్ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు

హ్యాపీ అని పేరు పెట్టాం



మాకు, మా బాబుకి మా హ్యాపీ అంటే ఎంతో ప్రాణం. షిహ్‌త్జు జాతికి చెందిన డాగ్‌ను మూడేళ్ల కిందట రూ.20 వేలు పెట్టి కొన్నాం. ఇప్పుడు అది మాలో ఒక్కటి. ఇవి ఎంతో విశ్వాసంతో ఉంటాయి. దానితో మేము ఆడుకుంటాం. ఎవరిపైన దాడి చేయదు. డాగ్‌కు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం.

– సాయి, విద్యుత్‌నగర్

ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టాం

డాగ్‌లకు ఎంతో విశ్వాసం ఉంటుంది. అందుకే అవి అంటే నా ఎంతో ఇష్టం. మేము పెంచుకున్న డాగ్ కొన్ని నెలల కిందట చనిపోయింది. దాని నుంచి కోలుకోవడం కోసం ఎంతో సమయం పట్టింది. దానిని మా ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టాం. దాని గుర్తుగా మొక్కలను పెంచుతున్నాం.

– ప్రియాంక, రామచంద్రారెడ్డినగర్

కొన్ని జాతులు.. వాటి ధరలు



సమోయెడ్ – స్నేహపూర్వక ప్రవర్తనకు ప్రసిద్ధి. తెల్లని వెంట్రుకలతో అందంగా ఉంటాయి. వీటి ధర రూ.45 నుంచి రూ.1.30లక్షల వరకు ఉంటుంది. ధర ఎక్కువైనా వీటికి మార్కెట్‌లో భలే డిమాండ్ ఉంది. కొనుగోలు చేసేందుకు పోటీ పడుతుంటారు.

ఇంగ్లిష్ బుల్‌డాగ్– బుల్‌డాగ్స్‌గా పిలుచుకునే విలక్షమైన జాతి కుక్కలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఇవి ప్రత్యేకమైన రూపాన్ని కలిగి ఉంటాయి. వీటి ధర మార్కెట్లో రూ.40వేల నుంచి రూ.70వేల వరకు ఉంటుంది.

ఆఫ్ఘన్ హౌండ్– ఇవి చూడటానికి వింతగా కన్పిస్తాయి. ఒకానొక సందర్భంలో అసలు ఇవి కుక్కలేనా అన్న సందేహమూ కలుగుతుంది. పొడవాటి మెడను, సిల్కీ వెంట్రుకలను కలిగి ఉండే వీటికి మార్కెట్‌లో రూ.60వేల నుంచి రూ.80వేల వరకు ధర పలుకుతుంది.



సైబీరియన్ హస్కీ– ఈ జాతికి చెందిన కుక్కలు నీలి కళ్లతో ఉంటాయి. వీటిని చాలామంది ఇష్టపడతారు. వీటి ధర దాదాపు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు ఉంటుంది.


పెట్ క్లబ్‌లో డాగ్స్‌కు సంబంధించిన ఆహార పదార్థాలు

రోట్ వీలర్– ఈ జాతికి చెందిన డాగ్స్ అత్యంత శక్తివంతమైనవి. విశ్వాసమైనవి కూడా. కేసులను చేధించేందుకు పోలీసులు వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. వీటి ధర రూ.10వేల నుంచి రూ.80వేల వరకు ఉంటుంది.



టిబెటిన్ మాస్టిఫ్– ఇవి చూడటానికి చాలా పెద్దగా, గంభీరంగా కనిపిస్తాయి. మందపాటి చర్మంతో భయానకంగా కనిపించే డాగ్స్ అత్యంత అరుదుగా దొరుకుతాయి. దేశంలోనే అత్యంత ఖరీదైన, అరుదైన జాతుల్లో ఇవి ఒకటి. వీటి ధర రూ.60వేల నుంచి రూ.2.50లక్షల వరకు ఉంటుంది.

అప్రజాస్వామిక విధానాలపై ప్రశ్నిస్తాం

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి విజ్ఞప్తిసంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జ్ఞాన మంజరి

ఎడ్యుకేషన్: విద్యా వ్యాపారులను ఓడించి, ఉపాధ్యాయ ఉద్యమ నేత అశోక్‌కుమార్‌ను గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి విజ్ఞప్తి చేశారు. శనివారం సంగారెడ్డిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానమంజరి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలోకి పోటీలోకి వచ్చిన రియల్ ఎస్టేట్ విద్య వ్యాపారులను ఓడించి ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడైన వై. అశోక్ కుమార్‌ని గెలిపించాలని కోరారు. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ప్రశ్నించి ఎండబెట్టడానికి పెద్దల సభకి ఉద్యమ నాయకుడి పంపించడం అవసరమని కోరారు. టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు కోశాధికారి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సాయి తేజ, జిల్లా కమిటీ సభ్యులు వెంకయ్య పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

● 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
● ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్


నిందితుడిని చూపుతున్న ఏసీపీ మధు, సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్న అంతర్ జిల్లా దొంగను టూటౌన్ పోలీసులు అరెస్టుచేసి, అతడి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొన్నారు. ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. పట్టణంలోని టెలికమ్ నగర్‌కు చెందిన దయానంద్ తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని కొద్ది రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వారు నర్సాపూర్ డబుల్ బెడ్రూంలకు వెళ్లే రాజీవ్ రహదారిపై అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన ఆస సుదర్శన్ కొద్ది రోజులుగా పట్టణంలో పలు చోట్ల ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లుగా ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గతంలో వివిధ కేసులలో జైలుకు వెళ్లి వచ్చినట్లు చెప్పారు. దీంతో నేరస్థుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మధు, సీఐ ఉపేందర్ తెలిపారు. కీలకంగా వ్యవహరించిన క్రైం కానిస్టేబుళ్లు కనకరాజు, ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌ను అభినందించి, నగదు రివార్డు అందజేశారు.

380 కుట్టు మెషీన్లు ఉచిత పంపిణీ



మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న సచిన్, లక్ష్మారెడ్డి

జహీరాబాద్: పేదలు స్వయం ఉపాధిని పొంది వారి కాళ్లపై వారు నిలబడేందుకుగాను కుట్టు శిక్షణ పొందిన 380 మంది మహిళలకు కోల్ ఇండియా సంస్థ ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేసింది. ఈ మేరకు ఆ సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సచిన్ శనివారం మీడియాకు వెల్లడించారు. జహీరాబాద్‌లోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జి అండ్ సరీ్వస్ సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు వీటిని అందజేసినట్లు తెలిపారు. సంస్థ సాధిస్తున్న లాభాల్లో కొంత సొమ్మును దేశ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను కేటాయిస్తున్నట్లు చెప్పారు. జహీరాబాద్‌లో వికాస్ సంస్థ తరపున శిక్షణ పొందిన 560 మందికి ఇప్పటివరకు రెండు విడతల కింద ఉచితంగా కుట్టు మెషీన్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి, వికాస్ సంస్థ డైరెక్టర్లు శుక్లవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సబ్ కోఆర్డినేటర్ రాంచంద్రారెడ్డి, శిక్షకులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని మల్లన్నగండికి చెందిన కటికె మహేశ్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. 3వవార్డులో నివసిస్తున్న మహేశ్ ఈనెల 18న జగ్గిరిగుట్టలోని బంధువుల వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి శనివారం వచ్చేసరికి ఇంటికి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, 20 తులాల వెండి, రూ.20వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్‌ఐ పాండు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


అంబయ్య (ఫైల్)

జిన్నారం (పటాన్‌చెరు): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం .. మున్సిపాలిటీలోని దోమడుగు గ్రామానికి చెందిన ఏరు అంబయ్య (44), గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి ఇబ్బంది పడుతున్నాడు. ప్రతిరోజు బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి వచ్చేవాడు. ఈనెల 10న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం అంబయ్య వదిన వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదం ముగ్గురికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం మండలంలోని శాలిపేటకు చెందిన వ్యక్తి టిప్పర్‌ను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. ఇదే సమయంలో మెదక్ నుంచి చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో విధులు నిర్వహించేందుకు వస్తున్న ఇద్దరు వ్యక్తులు కిందపడిపోయిన బైక్‌ను ఢీ కొని ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో కళాశాల సిబ్బంది పవన్ కాలు, ఉమర్ చేయి విరిగింది. విషయం గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో తీవ్రగాయాలకు గురైన వారిని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


సాయికుమార్ (ఫైల్)

జోగిపేట(అందోల్): యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. డబుల్‌బెడ్ రూంలో కొంతకాలంగా తల్లి బాలమణి, కొడుకు సాయికుమార్ నివాసం ఉంటున్నారు. తల్లి తన కూతురుకు ఆరోగ్యం బాగా లేదని మూడు రోజులు క్రితం హైదరాబాద్‌కు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని యువకుడు సాయికుమార్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శుక్రవారం కొడుకుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో జోగిపేటలోని తన అల్లుడికి ఫోన్ చేసి సాయికుమార్ ఫోన్ లిఫ్ట్ చేయడంలేదని, ఒక్కసారి డబుల్‌బెడ్ రూం వద్దకు ఇంటికి వెళ్లి రావాలని సూచించింది. దీంతో శనివారం సాయంత్రం అల్లుడు రమేశ్ తన సోదరుడితో కలిసి వెళ్లి తలుపుతట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దుర్వాసన రావడంతో రెండు రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నారు. గత కొంత కాలంగా యువకుడి మానసిక పరిస్థితి బాగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల్లోనూ సాక్షికి ఆదరణ


సాక్షి పత్రికను చదువుతున్న విద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సాక్షి తెలుగు దిన పత్రికకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజు ఒక పిరియడ్ లైబ్రరీకి కేటాయిస్తారు. ఇందులో విద్యార్థులు రకరకాల పుస్తకాలతో పాటుగా సాక్షి తెలుగు దిన పత్రికను సైతం ప్రతి రోజు చదువుతూ సమాజంలో జరిగే సంఘటనలను తెలుసుకుంటున్నారు. సదాశివపేట మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులు సాక్షి పత్రికను చదువుతుండగా.. సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

ట్రాన్స్‌ఫరబుల్ స్కిల్ ప్రోగ్రాంతో పరిజ్ఞానం


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్

సదాశివపేట(సంగారెడ్డి): సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఉద్యోగాలు ఎలా సాధించాలో ట్రాన్స్‌ఫరబుల్ స్కిల్ ప్రోగ్రాం ఉపయోగపడుతుందని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బంగ్లా భారతి పేర్కొన్నారు. సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏడు రోజుల పాటు మహింద్రా ప్రైడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏడు రోజులు క్రమశిక్షణతో కూడిన నైపుణ్యత స్కిల్స్ ప్రోగ్రాం జరిగిందన్నారు. విద్యార్థులు మంచి పరిజ్ఞానం సంపాదించారని రోబోయే రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిపికెట్లు ప్రదానం చేశారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సర్వే డాక్టర్ మురళీకృష్ణ, శంకుతల, సావిద్య, రాధ, మంజుల, విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి కృషి చేయండి

ఎంపీ రఘునందన్ రావు

సంగారెడ్డి : బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగులు పాటు పడి లాభాల బాటలో నడిపించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శనివారం సంగారెడ్డిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరై రఘునందన్ రావు మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడంతో పాటు మెరుగైన సిగ్నలింగ్ వ్యవస్థను అందించాలని సూచించారు. దేశంలో బీఎస్ఎన్ఎల్ బంద్ చేసే స్థాయికి చేరుకుంటే ప్రధాని నరేంద్ర మోదీ ఆదుకున్నారన్నారు. అన్ని నెట్‌వర్క్ వ్యవస్థలు 5జి స్థాయిలోకి వచ్చి.. 6జి వైపు అడుగులు వేస్తుంటే బీఎస్ఎన్ఎల్ మాత్రం ఇంకా 4జి స్థాయిలోనే ఉందని 5జీగా అప్ గ్రేడ్ కావాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తే బీఎస్ఎన్ఎల్‌కు కస్టమర్లు పెరిగి లాభాల బాటలోకి వస్తుందన్నారు.